ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



5 మహబూబాబాద్
ఆదివారం 18 ఫిబ్రవరి 2024

రోజుకు 500 లాట్ల మిర్చికే అమ్మకం టోకెన్లు

మానుకోట వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి షంషీర్

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఫిబ్రవరి 17 : మహబూబాబాద్ వ్యసాయ మార్కెట్‌లో మిర్చి ప్రతీరోజు 500 లాట్లకు మాత్రమే టోకెన్లు ఇవ్వనున్నట్లు మార్కెట్ కార్యదర్శి షంషీర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొద్దిరోజుల నుంచి మార్కెట్‌కు రోజూ 25 వేల బస్తాలు వస్తోండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీంతో మార్కెట్‌లోనే మూడు, నాలుగు రోజులు పడుతుందని చెప్పారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రోజు టోకెన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. మిర్చిని దశల వారీగా అమ్మకానికి తీసుకురావాలని కోరారు. దీనికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



పగుళ్లు వచ్చిన మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు

కాళేశ్వరం కంచికేనా?

ప్రభుత్వ శ్వేతపత్రంతో ప్రాజెక్టు భవితవ్యంపై నీలినీడలు

"కాళేశ్వరం ప్రాజెక్టు భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకుం టున్నాయి. అసెంబ్లీలో సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం విడుదల చేసిన శ్వేత పత్రంలో కాళేశ్వరాన్ని ఓ పనికి రాని ప్రాజెక్టుగా ప్రభుత్వం అభివర్ణించింది. కాగ్ నివేదికలోనూ గత ప్రభుత్వం అవసరానికి మించి ఖర్చు చేసిందని పేర్కొంది. వీటన్నింటికి తోడు కుంగిన మేడిగడ్డ బ్యారేజీతో పాటు సీపేజీలతో లీకేజీలు అవుతున్న అన్నారం బ్యారేజీల భవిష్యత్తు ప్రమాదంలో పడింది. వీటి మరమ్మతులకు నిధుల కొరత ఏర్పడుతోంది. అలాగే 2022 జూలై వరద లకు నీట మునిగిన కన్నెపల్లి పంపుహౌస్‌లో 17మోటర్లకు కేవలం ఆరు మాత్రమే రన్నింగ్‌లో ఉన్నాయి. మిగతా మోటర్ల పరిస్థితేంటి? వీటికి మరమ్మతులు చేసేదెవరు? అనేది చర్చనీయాంశంగా మారింది. దీంతో అసలు కాళేశ్వరం ప్రాజెక్టులోని కీలకమైన ఈ కట్టడాలు భవిష్యత్తులో పర్యాటక ప్రాంతాలుగా మాత్రమే పనికి వస్తాయా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి."

- అన్నారం బ్యారేజీ కూడా కుంగిపోనుందా!!
- ఇప్పటికే సీఫేజీలతో బ్యారేజీల నుంచి నీళ్లు లీక్
- మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగడంతో గేట్లెత్తిన అధికారులు
- వరదలకు మునిగిన కన్నెపల్లి పంపుహౌస్‌లోని 17మోటార్లలో పనిచేసేవి ఆరే..
- ప్రాణహిత-చేవెళ్ల వైపే ప్రభుత్వం మొగ్గు
- కాళేశ్వరం.. పర్యాటక ప్రాంతంగానే మిగిలిపోతుందని అనుమానాలు

వరంగల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా నిర్మించింది. 2016 మే 2వ తేదీన అప్పటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేయగా.. రూ.84వేల కోట్ల అంచనాలతో ఈ ప్రాజెక్టును నిర్మించి ప్రారంభించారు. తొలుత రెండు టీఎంసీల చొప్పున 90 రోజుల పాటు ప్రతి ఏటా 180 టీఎంసీల నీటిని గోదావరి నీటిని ఎత్తిపోయా లని లక్ష్యంగా పెట్టుకున్నారు. 18,25,700 ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించటంతో పాటు మరో 18,82,970 ఎకరాల ఆయకట్టును స్థీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతో భూపాలపల్లి జిల్లా మహదేవ పూర్ మండలం కాళేశ్వరం సమీపంలో మేడిగడ్డ వద్ద గోదావరిపై ఆనకట్ట నిర్మించారు. 16.17టీఎంసీల నీరు మేడిగడ్డ వద్ద నిల్వ చేసి కన్నెపల్లి పంపహౌస్‌లో ఏర్పాటు చేసిన 17 మోటర్లతో ఎత్తిపోయాలని నిర్ణయించా రు. 2019 జూన్ 21న ఈ ప్రాజెక్టును అప్పటి సీఎం కేసీఆర్ ప్రజలకు అంకి తం చేయగా.. ఆ సమయంలోనే మూడో టీఎంసీ నీటిని ఎత్తిపోసే పనులకు కూడా శ్రీకారం చుట్టారు. దీంతో అంచనా వ్యయం రూ.1.47లక్షల కోట్లకు పెరిగింది. ఆయక ట్టును కూడా 45లక్షలకు పెంచారు. అయితే 2019 నుంచి 2023 వరకు కేవలం 164టీఎంసీల నీటినే ఎత్తిపోశారు. అంతేకాకుండా కేవలం 94 వేల ఎకరాల ఆయకట్టుకు నీరం దించారు. దీంతో పాటు ప్రాజెక్టు కోసం భూములను త్యాగం చేసిన భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ రైతులకు చెందిన ఇతర భూములకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎకరం భూమికి కూడా చుక్క నీరందదు. ఉమ్మడి వరం గల్ జిల్లాలోని పలు ప్రాంతాలకు ఎస్సారెస్పీ కాలువల ద్వారా కాళేశ్వరం నీళ్లు రైతులకు అందటమే కొంత ఊరట.



నీట మునిగిన కన్నెపల్లి పంపుహౌస్ (ఫైల్)




అన్నారం బ్యారేజీలో బుడుగలు (ఫైల్)

మునిగిన పంప్‌హౌస్.. కుంగిన బ్యారేజీలు..

కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైనవి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కన్నెపల్లి, సుందిళ్ల పంపుహౌస్‌లు. అయితే 2022 జూలై 14వ తేదీన వచ్చిన వరదలకు కన్నెపల్లి, సుందిళ్ల పంపహౌస్‌లు నీట మునిగాయి. సుందిళ్ల పంప్‌హౌస్‌కు పెద్దగా నష్టం లేకున్నప్పటికి కన్నెపల్లి పంప్‌హౌస్‌లో భారీ నష్టం వాటిల్లింది. పంపుహౌస్‌లో ఉన్న పెద్ద క్రేన్‌లు విరిగి అందులో ఉన్న 17మోటర్లపై పడిపోయాయి. ఆ ఘటనలో 7మోటర్లు పూర్తిగా దెబ్బతినగా, 4మోటర్లకు పాక్షింగా నష్టంవాటిల్లింది. అప్పటి నుంచి కన్నెపల్లి పంపుహౌస్‌లోకి ప్రవేశాలను గత ప్రభుత్వం నిషేధించింది. దీంతో లోపల ఏం జరుగుతుందో ఎవరికి తెలియని పరిస్థితి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాస్తవ పరిస్థితులు వెలుగులోకి వస్తున్నాయి. మొత్తం 17 మోటర్లలో కేవలం ఆరు మోటర్లు మాత్రమే పని చేస్తున్నట్లు

మిగతా 6వ పేజీలో..



అన్నారం బ్యారేజీ 10 గేట్లు ఎత్తివేత

- ఫౌండేషన్ టెస్టుల కోసం 7వేల క్యూసెక్కుల నీరు విడుదల
- ఎన్‌డీఎస్‌ఏ ఆదేశాల మేరకు పరీక్షలు

మహదేవపూర్ / మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 17 : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జయశంకర్ భపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన అన్నారం(సరస్వతీ) బ్యారేజీ నుంచి శనివారం నీటిని విడుదల చేసినట్టు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. అయితే మేడిగడ్డ బ్యారేజీ బ్లాక్-7లో 20వ పిల్లరు కుంగిన నేపథ్యంలో జాతీయ ప్రాజెక్టుల రక్షణ (ఎన్‌డీఎస్‌ఏ) బృందం అన్నారం, సుందిళ్ల బ్యారేజీలనూ పరిశీలించే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలోనే అన్నారం బ్యారేజీ నిర్మాణ సంస్థ ఆఫ్కాన్ కంపెనీ ఆధ్వర్యంలో డిల్లీకి చెందిన పార్సన్ కంపెనీతో ఫౌండేషన్ టెస్టులు చేయించేందుకు నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో బ్యారేజీలో శనివారం ఉదయం 2.06 టీఎంసీల నీరు నిల్వ ఉండగా 10గేట్లను 7 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని, ఒకేసారి పూర్తినీటిని విడుదల చేస్తే దిగువన కాళేశ్వరం, మేడిగడ్డ వద్ద ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండటంతో నెమ్మదిగా వదులుతున్నామన్నారు. వచ్చేది వేసవి అయినప్పటికీ తప్పని సరి పరిస్థితుల్లో నీటిని విడుదల చేయాల్సి వస్తోందన్నారు.



వన దేవతల గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

వనదేవతల దర్శనానికి..

లక్షలాదిగా మేడారానికి తరలొస్తున్న భక్తులు

వనజాతరకు మరికొద్దిరోజులే సమయమున్న నేపథ్యంలో పలు ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వనదేవతల దర్శనానికి తరలొస్తున్నారు. ఈ క్రమం లో శనివారం లక్షమందికి పైగా జనం మేడారం వచ్చారని దేవాదాయశాఖ అధికారులు చెబుతున్నారు. బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో కుటుంబ సమేతంగా, బంధుమి త్రులతో కలిసి తల్లుల సన్నిధికి చేరుకుంటున్న భక్తులు జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి.. కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించి.. సమ్మక్క సారలమ్మ గద్దెలకు చేరుకొని పూలు, పండ్లు, పసుపు కుంకుమ, కొబ్బరికాయలు, బెల్లం, చీరసారె సమర్పించుకుం టున్నారు. యాట మొక్కులు చెల్లించుకుం టున్నారు. లక్ష మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించు కున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. - మేడారం

భక్తులకు మెరుగైన సేవలందించాలి



- వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలి : మంత్రి సీతక్క
- మేడారంలో వైద్య అధికారులతో సమీక్ష
- వివిధ శాఖల సేవలకూ శ్రీకారం

వివరాలు 7లో..

నేడు జిల్లాలో సీవోఈ ప్రవేశ పరీక్ష

- నాలుగు కేంద్రాల్లో హాజరుకానున్న 1580 మంది విద్యార్థులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 17 : తెలంగాణ గిరిజన సంక్షేమశాఖ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు పొందడానికి ఆదివారం అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆ విద్యాసంస్థల ప్రాంతీయ సమన్వయ అధికారి ఆగస్టిన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే ఎంట్రెన్స్‌కు సకాలంలో హాజరుకావాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహబూబాబాద్ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాల (మహిళ)సెంటర్-400, మరిపెడ గిరిజనసంక్షేమబాలుర జూనియర్ కళాశాల -400, కురవి ఏకలవ్య బాలికల గురుకుల కళాశాల సెంటర్-496, మానుకోట గిరిజన సంక్షేమశాఖ బాలుర జూనియర్ కళాశాల-284, వెరసీ 1580 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. నిర్ణీత సమయాని కంటే గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

- హైకోర్టు జడ్జీ శ్రీనివాసరావు



కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు జడ్జీలు శ్రీనివాసరావు, రాజేశ్వర్‌రావు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 17: కోర్టులో కేసులను పెండింగ్‌లో పెట్టకుండా త్వరితగతిన పరిష్కరించి, ఫిర్యాదు దారులకు న్యాయం చేయాలని హైకోర్టు జడ్జీ, మహబూబాబాద్ జిల్లా కోర్టు అడ్మినిస్ట్రేటివ్ జడ్జీ జె.శ్రీనివాసరావు సూచించారు. మహబూబాబాద్ జిల్లా కోర్టులో ఆధునీకరించిన సీనియర్ సివిల్ కోర్టును ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం పోలీసులచే గౌరవవందనం స్వీకరించి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే మహబూబాబాద్ జిల్లా కోర్టును అద్భుతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. బార్ అసోసియేషన్ సభ్యుల సహకారం ఎప్పుడు అవసరం ఉంటుందని చెప్పారు. కోర్టుల్లో కేసుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతున్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. హైకోర్టు జడ్జీ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ జిల్లా కోర్టు రోజురోజుకు అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. అనంతరం లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను పరిష్కరించేందుకు కృషి చేసిన పోలీస్ కానిస్టేబుళ్లకు ప్రశంసాపత్రాలను అందించి, అభినందించారు. ఆధునీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేసిన ఆర్అండ్‌బీ ఈఈ తానేశ్వర్‌రావును అభినందించారు. కాగా, హైకోర్టు జడ్జీలు శ్రీనివాసరావు, రాజేశ్వర్‌రావును మానుకోట జిల్లా కోర్టు ప్రధానన్యాయమూర్తి చంద్రశేఖరప్రసాద్ శాలువాలతో సత్కరించి, మెమెంటోలను అందజేశారు. తొలుత అనంతాద్రి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో వారు ప్రత్యేక పూజలు చేశారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది సురేష్, అదనపు జూనియర్ సివిల్ న్యాయవాది తిరుపతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయవాది మౌనిక, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటస్వామి, పీపీ చిలుకమారి వెంకటేశ్వర్లు, జీపీ కొంపెల్లి వెంకటయ్య, ఏజీపీ బోనగిరి ఆనంద్‌గుప్తా, ఏఎస్పీ చెన్నయ్య, ఎక్సైజ్ జిల్లా సూపరిండెంట్ కిరణ్, ఆర్అండ్‌బీ ఈఈ తానేశ్వర్‌రావు, డీఈవో రామారావు, విద్యుత్‌శాఖ డీఈ విజయ్, సీనియర్ న్యాయవాదులు కొండపల్లి కేశవరావు, మేక సురేష్‌రెడ్డి, తుంపిళ్ల శ్రీను, మామిడాల సత్యనారాయణ, దాసరి నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు

కురవి : శ్రీవీరభద్ర స్వామి సన్నిధిలో హైకోర్టు జడ్జీలు జె.శ్రీనివాసరావు, ఎన్.రాజేశ్వర్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయానికి వచ్చిన జడ్జీలకు శ్రీవీరభద్ర స్వామి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వీరభద్ర స్వామి, భద్రకాళి ఆలయాల్లో వారు పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆశీర్వచం చేసి, వీరభద్రస్వామి చిత్రపటాలను అందచేశారు.

నేటినుంచి మేడారానికి ప్రత్యేక బస్సులు

- తొర్రూరు ఆర్టీసీ డీఎం విశ్వనాథ్

తొర్రూరు, ఫిబ్రవరి 17 : తొర్రూరు ఆర్టీసీ డిపో నుంచి మేడారం జాతరకు నేటి నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డీఎం విశ్వనాథ్ తెలిపారు. శనివారం డివిజన్ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం (నేటి) నుంచి ఈనెల 25వ తేదీ వరకు మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని తెలిపారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణం, పెద్దలకు రూ.350, చిన్నపిల్లలకు రూ.200 చార్జీలు నిర్ణయించడం జరిగిందన్నారు. మహిళలు తప్పనిసరిగా ఒరిజినల్ ఆధార్ కార్డువెంట తీసుకురావాలన్నారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ సురేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. బస్టాండ్ ఆవరణలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ తిరుమల్‌రావు, ఎస్టీఐ రజితా రెడ్డి, సీఐ సంజీవ్ ఉన్నారు.

మహాజాతరకు హుండీలు సిద్ధం



మేడారంలో ఏర్పాటు చేసిన హుండీలు(ఫైల్)

మేడారం, ఫిబ్రవరి 17 : మహా జాతరలో భక్తులు సమర్పించే కానుకల కోసం దేవాదాయశాఖ అధికారులు మేడారంలో హుండీలను ఏర్పాటు చేస్తున్నారు. 452 ఇనుప, 100 క్లాత్ హుండీలను సిద్ధం చేయగా.. సమ్మక్క పేరుతో 200, సారలమ్మ పేరుతో 200, పగిడిద్దరాజు పేరుతో 26, గోవిందరాజు పేరుతో 26 హుండీలను సిద్ధం చేశామని దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనీల్ తెలిపారు. ఇవేకాకుండా మరో 60 హుండీలు మరమ్మతులో ఉన్నాయన్నారు. వీటితోపాటు వందక్లాత్ హుండీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వాటన్నిటికి తాళాలు వేసి సీల్‌చేసి.. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సునీత, మేడారం ఈవో రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ సంతకాలతో ఉన్న పేపరు అంటించారు.

హౌస్ హోల్డర్లకు విద్యుత్ మీటర్లు ఇవ్వాలి

- సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథి రెడ్డి

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 17 : మునిసిపాలిటీ పరిధిలో ఇంటి నెంబర్ల తరహాలో ఇచ్చిన హౌస్ హోల్డర్ నెంబర్లు ఉన్న ఇళ్లకు విద్యుత్ మీటర్లు ఇవ్వాలని సీపీఐ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో విద్యుత్ డీఈ విజయ్‌కు శనివారం సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపల్ పరిధిలోని 22, 36 వార్డుల పరిధిలో విద్యుత్ స్తంభాలు వేయడంతో పాటు హౌస్ హోల్డర్లకు కరెంటు మీటర్లు మంజూరు చేయాలని కోరారు. విద్యుత్ స్తంభాలు లేక అనేక కాలనీల్లో సమస్యలు తలెత్తుతు న్నాయని వాటిని సత్వరమే పరిష్కరించాలన్నారు. పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్, చింతకుంట్ల వెంకన్న, కట్లోజు పాండురంగాచారి, పీరవెళ్లి రవి, వెలుగు శ్రావణ్, కేదాసు రమేష్, మంద శంకర్, భారత రమేష్ పాల్గొన్నారు.



డీఈ విజయ్‌కి వినతి పత్రమిస్తున్న సీపీఐ నాయకులు

మున్నేరు లిఫ్ట్.. మూలన పడింది..

- బతుకమ్మ చెరువులోకి రాని ఎత్తిపోతల నీరు..
- చోరీకి గురైన విద్యుత్ మోటార్లు
- ఇబ్బందులు పడుతున్న ఆయకుట్టు రైతులు
- ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని అన్నదాతల విజ్ఞప్తి



పంప్‌హౌస్‌లో ధ్వంసమైన లిఫ్ట్ ప్యానెల్ బోర్డు

డోర్నకల్, ఫిబ్రవరి 17 : రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు.. ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరందక విలవిల్లాడుతున్నారు.. మహబూబాబా ద్ జిల్లాలోని డోర్నకల్ మున్నేరు నదిపై ఏర్పాటు చేసిన లిఫ్ట్ పుష్కరకాలంగా మూలనపడింది. దీంతో ఈ ఎత్తిపోతల ద్వారా బతుకమ్మ చెరువు ఆయకట్టు రైతులకు నీరురాక, అవస్థలను ఎదుర్కోంటున్నారు. కనీసం ఇది పనిచేస్తోందా.. లేదా, అది ఎక్కడ ఉందో కూడా ప్రస్తుత ఇరిగేషన్ అధికారులకు తెలియకపోవడం గమనార్హం. దాని వినియోగంలో లేకపోయే సరికి పంప్‌హౌస్‌లో ఉన్న సామగ్రిని దొంగలు ఎత్తుకువెళ్లారు. అధికారులు, ప్రజాప్రతినిధులు లిఫ్టును మరమ్మతులు చేయించి, వినియోగంలోకి తీసుకురావాలని బతుకమ్మ చెరువు ఆయకట్టు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

2010లో నిర్మాణం..

డోర్నకల్ ప్రాంతంలో 2008 నుంచి ఐదేళ్లపాటు సరైన వర్షాలు పడలేదు. మరోవైపు డోర్నకల్ సమీపం నుంచి ప్రవహించే మున్నేరుకు ఎగువ ప్రాంతాల్లో పడిన వర్షాలతో సీజన్ ఆరంభంలో వరద నీరువచ్చి వృథాగా దిగువ ప్రాంతాలకు తరలిపోయేది. దీంతో డోర్నకల్ ప్రాంతంలోని బతుకమ్మ చెరువు, మున్నేరు వాగు పరిసర ప్రాంతాల రైతులు సాగునీరు లేక నానా ఇబ్బందులు పడుతుండే వారు. సాగునీటి కోసం బోర్లు, బావుల మీద ఆధారపడే వారు. కానీ, కొన్నిచోట్ల భూగర్భ జలాలు తక్కువగా ఉండడంతో నీరు సరిగ్గా అందక, నాటు వేసిన పంట పొలాలు ఎండిపోయేవి. ఈ విషయాన్ని సంబంధిత రైతులు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లారు. మున్నేరు నదిపై లిఫ్ట్‌ను ఏర్పాటు చేసి, అక్కడి నుంచి బతుకమ్మ చెరువుకు నీటిని తరలించి నింపితే ఈ ప్రాంత రైతులు సాగు చేసే పంటకు నీరు అందుతుందని, దీంతో పాటు భూ గర్భ జలాలు పెరుగుతాయని రైతులు వారికి వివరించారు.

ఈ విషయంపై అధ్యయనం చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు మున్నేరుపై 2010లో చిన్న

మిగతా 8వ పేజీలో..

సామగ్రి చోరీకి గురైంది.

- భద్రునాయక్, ఇరిగేషన్ డీఈఈ, డోర్నకల్



డోర్నకల్‌లో బతుకమ్మ చెరువుకు ఏర్పాటు చేసిన లిఫ్టుకు సంబంధించిన సామగ్రి గత కొంతకాలం క్రితం చోరీకి గురైంది. వాటి స్థానంలో కొత్తవాటిని అమర్చి లిఫ్టును వినియోగంలోకి తీసుకురావడానికి అంచనాలను రూపొందిస్తున్నాం. త్వరలోనే ఆయకట్టు రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తాం. రైతుల సూచనలు కూడా పరిగణలోకి తీసుకుని సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందిస్తాం.

మానుకోట ఎంపీపీపై వీగిన అవిశ్వాసం



అవిశ్వాసానికి హాజరైన ఇద్దరు ఎంపీటీసీలు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 17 : మహబూబాబాద్ ఎంపీపీపై పెట్టిన అవిశ్వాస తీర్మాణం వీగిపోయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో అలివేలు శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మహబూబాబాద్ మండల పరిషత్‌లో 13 మంది ఎంపీటీసీలు ఉండగా, కంబాలపల్లి ఎంపీటీసీ సరస్వతి గత నాలుగునెలల క్రితం పదవికి రాజీనామా చేశారు. మిలిగిన 12 మంది ఎంపీటీసీలకు గాను ఇద్దరు ఎంపీటీసీలు మాత్రమే హాజరయ్యారని, దీంతో ఎంపీపీపై పెట్టిన అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రకటించారు. ఎంపీడీవో రవికుమార్ పాల్గొన్నారు.

కాళేశ్వరం.. కంచికేనా?

5వ పేజీ తరువాయి

సమాచారం. మిగతా మోటర్లను మరమ్మతులకు నోచుకోకపోవటంతో అందులో ఎన్ని పనికి వస్తాయో అనేది తెలియటం లేదని అధికారులు పేర్కొంటున్నారు. పూర్తిస్థాయిలో పంప్ హౌస్ వినియోగంలోకి రావాలంటే కనీసం రూ.1200కోట్లు అవసరంగా గతంలో ఇంజనీరింగ్ అధికారులు పేర్కొన్నారు. కన్నెపల్లి పంప్ హౌస్ అవస్థల్లో ఉండగానే 2023 అక్టోబరు 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాక్‌లో 20 పిల్లర్ కుంగిపోయింది. దీంతో పాటు 18, 19, 21, 22వ పిల్లర్లకు కూడా పగుళ్లు ఏర్పడినట్టు అధికారులు గుర్తించారు. దీని మరమ్మతుల కోసం సుమారు రూ.450కోట్లు అవసరంగా అధికారులు అంచనా వేశారు. అయితే బ్యారేజీ నిర్మాణంలోనే లోపాలు ఉన్నాయని, డిజైన్ లోపంతో బ్యారేజీకి ప్రమాదం పొంచి ఉందని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) అధికారులు నివేదిక ఇచ్చారు. దీనిపై విజిలెన్స్ విచారణలో కూడా మేడిగడ్డ బ్యారేజీ పనికి రాద నే తేల్చి చెప్పింది. దీంతో బ్యారేజీ మొత్తం కూల్చి కట్టాలంటే మళ్లీ రూ.4,500 కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో మేడిగడ్డ బ్యారేజీపై ప్రభుత్వం ఎటూ తేల్చలేక పోతోంది. మరోవైపు మరో కీలకమైన అన్నారం బ్యారేజీలోనూ లోపాలు వెలుగులోకి వచ్చాయి. 2023 అక్టోబరు 27న అన్నారం బ్యారేజీలో పలు పిల్లర్ల వద్ద సీపేజ్‌లు కనిపించాయి. దీంతో బ్యారేజీలో నీళ్ల లీకేజీతో పెద్ద పెద్ద బుడుగలు రావటంతో అధికారులు అప్పటికప్పుడు సిమెంట్ బ్యాగుల్లో ఇసుక నింపి సీపేజ్‌లను రాకుండా కట్టడి చేశారు. ఇది కూడా మేడిగడ్డ బ్యారేజీ టెక్నాలజీతోనే నిర్మించారు. ఇటీవల మరోసారి బ్యారేజీలో బుంగలు ఏర్పడంతో ఇంజనీర్లలో ఆందోళన వ్యక్తం అయింది. భూపాలపల్లి జిల్లాలో ఉన్న కీలకమైన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలతో పాటు కన్నెపల్లి పంపుహౌస్‌లు ప్రమాదంలో ఉండటం చర్చనీయాంశంగా మారింది.

కాళేశ్వరంపై ప్రభుత్వం వెనుకడుగు..

కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరం ప్రాజెక్టును మొదటి నుంచి వ్యతిరేకిస్తుంది. ప్రాణహిత-చెవేళ్ల ప్రాజెక్టును రీడిజైన్ చేసి కాళేశ్వరం కట్టడం గత ప్రభుత్వం చేసిన తప్పుగా సీఎం రేవంత్‌రెడ్డితో పాటు భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొంటున్నారు. శనివారం అసెంబ్లీలో విడుదల చేసిన శ్వేతపత్రంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మేడిగడ్డ వద్ద నీటిని నిల్వ చేయటం అసాధ్యమని, కనీసం అక్కడ కాఫర్ డ్యామ్ కూడా నిర్మించే పరిస్థితి లేదని మంత్రి ఉత్తమ్ తేల్చి చెప్పారు. గత ప్రభుత్వం కమీషన్ల కోసం రూ.38 వేల కోట్లతో ప్రాణహిత- చెవేళ్ల ప్రాజెక్టు పూర్తయ్యేదని, రూ.1.47లక్షల కోట్లకు అంచనాలను పెంచి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దీంతో భారీగా అక్రమాలు జరిగినట్లుగా ప్రభుత్వం పేర్కొంటుంది. దీంతో పాటు మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల్లో జరిగిన నష్టాన్ని నిర్మాణ సంస్థలే భరించేందుకు ముందుకు రాకపోవటంతో ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై వెనుకడుగు వేస్తుందనే చర్చ జరుగుతోంది. అన్నారం బ్యారేజీలో లీకేజీలు కూడా భవిష్యత్తులో బ్యారేజీకి ప్రమాదాన్ని తెచ్చి పెడతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీంతో మరో రూ.25వేల కోట్లు వెచ్చిస్తే చెవేళ్ల-ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణంతో పాటు 18లక్షల ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి వస్తుందని, కాళేశ్వరం ప్రాజెక్టు కంటే ప్రాణహిత- చెవేళ్ల ప్రాజెక్టును వినియోగంలోకి తేవటం ఉత్తమమని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వం చెవేళ్ల-ప్రాణహిత వైపే మొగ్గు చూపితే ఇప్పటికే నిర్మాణమైన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు భవిష్యత్తులో పర్యాటక ప్రాంతాలుగానే మిగిలి పోతాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

రేవంత్.. సంకుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

▸ బీసీల గురించి రాహుల్ మాట్లాడడం విడ్డూరం: కవిత



హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పాటు తర్వాత చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే(ఎస్‌కేఎస్) వివరాలు ఒకే కుటుంబం దగ్గర ఉన్నాయంటూ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడడం తగదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఇకనైనా సంకుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. 2011లో యూపీఏ ప్రభుత్వం రూ.4,500 కోట్ల ఖర్చుతో దేశవ్యాప్తంగా కులగణన చేసినా, నివేదిక మాత్రం బయటపెట్టలేదని దుయ్యబట్టారు. ఆ వివరాలను గాంధీ కుటుంబం దాచిపెట్టుకుందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇప్పుడు బీసీల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి బీసీల వ్యతిరేకి అని, గతంలో పార్లమెంట్‌లోనే రాజీవ్‌గాంధీ బీసీలకు వ్యతిరేకంగా మాట్లాడారని ఆరోపించారు. తలా తోకా లేకుండా ప్రవేశపెట్టిన తీర్మానంతో కులగణన ఎలా చేస్తారని నిలదీశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు ఉంటుందన్న ఊహాగానాలపై అడిగిన ప్రశ్నకు కవిత ఆచితూచి స్పందించారు. పొత్తు అంశం గురించి చెప్పేంత స్థాయి తనది కాదని పేర్కొన్నారు.

రవాణా శాఖలో భారీగా బదిలీలు

▸ ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐల బదిలీ

రవాణా శాఖలో ఏళ్ల తరబడి నుంచి ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న పలువురు రవాణాశాఖ అధికారులు(ఆర్టీఓ), ఎంవీఐలను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజకీయ పైరవీలతో పని చేయాల్సిన కేంద్రానికి బదులుగా లాభదాయకమైన చెక్‌పోస్టుల్లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌లు, సహాయ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌ల డిప్యూటేషన్‌లను గతవారం ప్రభుత్వం రద్దు చేసింది. తాజాగా రవాణా శాఖలో పూర్తి స్థాయిలో ప్రభుత్వం బదిలీలతో ప్రక్షాళన ప్రారంభించింది. మొట్టమొదటి సారిగా ప్రతీ అధికారి బదిలీ కోసం ప్రత్యేక జీవోను విడుదల చేసింది. ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐలను బదిలీ చేసింది.

గొర్రెల కొనుగోళ్ల బిల్లుల చెల్లింపులో మోసం!

▸ దర్యాప్తులో దూకుడు పెంచిన ఏసీబీ

▸ ఏపీ రైతుల స్టేట్‌మెంట్ రికార్డు

ఆంధ్రప్రదేశ్ రైతుల నుంచి గొర్రెల యూనిట్లు కొనుగోలు చేసి వారికి బిల్లులు చెల్లించకుండా దారి మళ్లించిన కేసు దర్యాప్తులో ఏసీబీ దూకుడు పెంచింది. ఎనిమిది మంది రైతులను శనివారం విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. ఏపీకి చెందిన 18 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన 133 యూనిట్ల గొర్రెలకు సంబంధించి రూ.2.8 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే ఎంతకీ తమ బిల్లు చెల్లింపుకాకపోవడంతో రైతులు పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఆరా తీయగా బిల్లులు మంజూరైనట్లు తెలిసింది. తమ పేరుతో వేరొకరు బిల్లులు తీసుకున్నట్లు తెలియడంతో తాము మోసపోయినట్టు గుర్తించిన బాధితులు గత డిసెంబరులో సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ వద్ద కొన్న గొర్రెల యూనిట్లకు డబ్బులు చెల్లించలేదని కాంట్రాక్టర్‌తోపాటు పశుసంవర్ధక శాఖ అధికారులపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా అవినీతి కోణంలో ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. 8 మంది ఏపీ రైతులను విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. కాంట్రాక్టర్ మోహినుద్దీన్, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు రవి కుమార్, కేశవసాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కాంగ్రెస్ గూటికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం?



ఖమ్మం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు త్వరలోనే కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు హైదరాబాద్‌లో చర్చలు జరిగినట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ నియోకవర్గాలుండగా.. భద్రాచలంలో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. గతంలో బీఆర్ఎస్‌లోనే ఉన్న తెల్లం వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రస్తుత రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. అయితే భద్రాచలంలో కాంగ్రెస్ నుంచి అప్పటికి సిటింగ్ ఎమ్మెల్యేగా పొదెం వీరయ్య ఉండడంతో తెల్లంకు టికెట్ విషయంలో భరోసా లభించలేదు. అదే సమయంలో బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆఫర్ రావడంతో వెంకట్రావు మళ్లీ బీఆర్ఎస్ గూటికి చేరారు. జిల్లాకు చెందిన మంత్రి పొంగులేటి అనుచరుడిగా ఉన్న వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికల తర్వాత వెంటనే కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరగగా.. ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి రూ.10కోట్లు నిధులు కేటాయించింది. ఆ నిధుల వినియోగంపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులకు అధికారం కల్పించింది. దీనికితోడు త్వరలో మార్కెట్ కమిటీలతో పాటు పలు నియామక కమిటీలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. ఈ నేపథ్యంలోనే తెల్లం కాంగ్రెస్ గూటికి చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్టు తెలిసింది. జిల్లా మంత్రి పొంగులేటితో పాటు మరో రాష్ట్ర మంత్రితో మంతనాలు సాగించి పార్టీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందే వెంకట్రావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునే అవకాశం ఉందని సమాచారం. అయితే తెల్లం వర్గీయులు మాత్రం తమ ఎమ్మెల్యే బీఆర్ఎస్‌లోనే ఉంటారని, కాంగ్రెస్‌లో చేరే అవకాశం లేదని చెబుతున్నారు.

సీపీఆర్ చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడిన ఎస్సై

వీడియో వైరల్ కావడంతో ప్రశంసల వెల్లువ



బాధితుడికి సీపీఆర్ చేస్తున్న ఎస్సై షైబెల్లి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమస్యలతో వేదనకు గురైన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం అందుకున్న ఎస్సై హుటాహుటిన అక్కడికి చేరుకొని బాధితుడికి సీపీఆర్ చేయడంతో అతను ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బెంగాల్‌కు చెందిన సంతోష్ ముఖర్జీ(38) ఇబ్రహీంపట్నంలోని బీఈఎల్ కన్‌స్ట్రక్షన్ సంస్థలో కూలి పని చేస్తున్నాడు. కుటుంబ సమస్యలతో మానసిక వేదనకు గురైన సంతోష్. శనివారం ఉన్నట్టుండి తాను పనిచేసే సంస్థ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతం వైపు వెళ్లాడు. గమనించిన తోటి కూలీలు పోలీసు వాహనంలో అటుగా వచ్చిన ఎస్సై షైబెల్లికి సమాచారమిచ్చారు. వెంటనే స్పందించిన ఎస్సై చుట్టుపక్కల వెతకగా.. సంతోష్ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. కిందకి దింపి చూసి శ్వాస ఆడటం లేదని తెలిసి సీపీఆర్ చేశారు. కొద్దిసేపటికి బాధితుడు స్పృహలోకి రావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడు. కాగా, బాధితుడికి ఎస్సై షైబెల్లి సీపీఆర్ చేస్తున్న వీడియో వైరల్ కావడంతో ఆయన చేసిన పనికి సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

పాల్గొన్న ముఖ్య నేతలు, బీఆర్ఎస్ శ్రేణులు.. ఆటో డ్రైవర్లకు ప్రమాదబీమా పత్రాలు అందజేసిన కేటీఆర్

▸ 'అతనే ఒక చరిత్ర' పేరిట కేసీఆర్‌పై డాక్యుమెంటరీ ప్రదర్శన

▸ కేసీఆర్‌కు గవర్నర్, సీఎం రేవంత్, హరీశ్, కేటీఆర్, కవిత శుభాకాంక్షలు



ఆటో డ్రైవర్లకు చెక్కులు అందజేస్తున్న కేటీఆర్

హైదరాబాద్/జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 70వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 70 కిలోల కేక్‌ను కట్‌చేశారు. అంతకుముందు బీఆర్ఎస్ నేతలతో కలిసి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా పలువురు ఆటో డ్రైవర్లకు రూ.1లక్ష కవరేజీతో కూడిన ప్రమాదబీమా పత్రాలను అందజేశారు. అదేవిధంగా దివ్యాంగులకు వీల్ చైర్లను పంపిణీ చేశారు. రాజకీయం, తెలంగాణ ఉద్యమ నేపథ్యం, కేసీఆర్ జీవితంలోని ముఖ్యమైన సందర్భాలపై 'అతనే ఒక చరిత్ర' పేరిట సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. కేసీఆర్ ఆమరణ దీక్ష విశేషాలను వివరించేలా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ప్రమాదవశాత్తు మరణించిన 70 మంది బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా కింద ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను మాజీ మంత్రులు తలసాని, మహమూద్ అలీ అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీలు కె.కేశవరావు, బడుగుల లింగయ్య యాదవ్, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, మాజీ మంత్రులు మహమూద్‌అలీ, తలసాని, నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ గౌడ్, పలువురు పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. కాగా, కేసీఆర్‌కు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆమె శుభాకాంక్షలు తెలుపుతూ రాసిన లేఖను, పుష్పగుచ్ఛాన్ని గవర్నర్ కార్యాలయ ప్రతినిధి ఒకరు తెలంగాణ భవన్‌లో అందజేశారు. కేసీఆర్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ స్వాప్నికుడు, స్వరాష్ట్ర సాధకుడు అని ట్విటర్ వేదికగా కొనియాడారు. కేసీఆర్‌కు జనసేన అధినేత పవన్ కల్యాణ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పోరాట పటిమతో అంచలంచెలుగా ఎదిగిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు.

కేసీఆర్ ప్రతిపక్ష నేత పాత్రను సమర్థంగా పోషించాలి: రేవంత్

అసెంబ్లీ వేదికగా మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "40 ఏళ్ల కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ పాత్ర పోషించిన కేసీఆర్.. తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రతిపక్ష నాయకుడి పాత్రను సమర్థంగా పోషించాలి. భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలి' సీఎం రేవంత్ ఆకాంక్షించారు.

ఎర్రవల్లిలో ఆయుష్య హోమం

కేసీఆర్ 70వ జన్మదినం సందర్భంగా శనివారం ఆయన దత్తత గ్రామమైన సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలో మాజీ సర్పంచ్ భాగ్యబాల్‌రాజు ఆధ్వర్యంలో ఆయుష్య హోమం నిర్వహించారు. ఉదయం రంగనాయకస్వామి ఆలయంలో కేసీఆర్ పేరున అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. మరోవైపు.. కేసీఆర్ తన జన్మదిన వేడుకలను ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో నిరాడంబరంగా జరుపుకొన్నారు. శనివారం ఉదయం మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రానికి వచ్చి కేసీఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డిపై అవిశ్వాసం

▸ కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే బీఆర్ఎస్ ప్రతిపాదన

▸ వికారాబాద్ అదనపు కలెక్టర్‌కు తీర్మాన ప్రతి అందజేత

వికారాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతామహేందర్‌రెడ్డిపై బీఆర్ఎస్ జడ్పీటీసీ సభ్యులు అవిశ్వాసం ప్రకటించారు. మొత్తం 12 మంది జడ్పీటీసీలు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ సంతకాలు చేసిన తీర్మాన పత్రాన్ని శనివారం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు అందజేశారు. కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే వ్యూహాత్మకంగా వికారాబాద్, తాండూరు మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, రోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జడ్పీటీసీలు సునీతపై అవిశ్వాసం ప్రకటించారు. ఈ తీర్మానంపై బీఆర్ఎస్ జడ్పీటీసీలు జడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయకుమార్(మోమిన్‌పేట), కె.నాగిరెడ్డి(దోమ), కె.మహిపాల్(దౌల్తాబాద్), ఎం.మేఘమాల(పూడూరు), కె.సుజాత (ధారూరు), కె.జయమ్మ(నవాబుపేట), నాగరాణి(కొడంగల్), హరిప్రియ(పరిగి), మంజుల(తాండూరు), ప్రమోదిని(వికారాబాద్), పి.మధుకర్(మర్పల్లి), కె.రాందాస్(కులకచర్ల) సంతకాలు చేశారు. అవిశ్వాస తీర్మానం అందజేసిన 15 రోజుల్లో అధికారులు నోటీసులు జారీ చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ అంశంలో అధికారులు ఏ విధంగా వ్యవహరించనున్నారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం వికారాబాద్ జిల్లా పరిషత్‌లో బీఆర్ఎస్‌కు 14మంది సభ్యులు ఉండగా, కాంగ్రెస్‌కు నలుగురు సభ్యులు ఉన్నారు. కాంగ్రెస్‌లో చేరిన సునీతా మహేందర్‌రెడ్డి బేషరతుగా చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయాలని జడ్పీ వైస్ చైర్‌పర్సన్ బైండ్ల విజయ్‌కుమార్ డిమాండ్‌చేశారు. రాజీనామా చేయకుండానే ఆమె పార్టీ మారడాన్ని ఖండిస్తూ అవిశ్వాసం ప్రకటించామన్నారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సైతం తన పదవికి రాజీనామా చేసిన తర్వాతే కాంగ్రెస్‌లో చేరాలని సూచించారు. బీఆర్ఎస్‌లో చేరినప్పుడు ఏమి ఆశించి వచ్చారో... అదే ఆశించి ఇప్పుడు కాంగ్రెస్‌లోకి వెళ్లారని విమర్శించారు. పట్నం దంపతులకు పదవీ వ్యామోహమే తప్ప.. ప్రజలపై ప్రేమ లేదని దుయ్యబట్టారు.

భక్తులకు మెరుగైన సేవలందించాలి

వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలి : పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

మేడారంలో వైద్య అధికారులతో సమీక్ష ● వివిధ శాఖల సేవలకూ శ్రీకారం



ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మేడారం, ఫిబ్రవరి 17 : మేడారం తరలొచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలు అదించాలని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క వైద్యఅధికారులకు ఆదేశించారు. శనివారం మేడారం పర్యటనలో భాగంగా ఆమె హెల్త్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ క్రిస్టినా, మహాజాతర నోడల్ అధికారి, హెల్త్ డైరెక్టర్ ఆర్.వి కర్ణన్, ఐటీడీఏ పీవో అంకిత్‌లతో కలిసి వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. మేడారం మహాజాతరలో భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. హెల్త్ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టీనా చోంగ్తు మాట్లాడుతూ జాతరలో ముఖ్యంగా వ్యాపారులు భక్తులకు విక్రయించే ఆహారంపై ఫుడ్ సేఫ్టీ అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులు భక్తులకు తెలిసే విధంగా సైన్‌బోర్డులను ఏర్పాటు చేయాలని, గద్దెల ప్రాంగణంలో ఉన్న టీటీడీ కళ్యాణ మండపంలో 24గంటల పాటు వైద్య సేవలు అందించాలని, మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. హెల్త్ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ 40జీవీకే అంబులెన్సులు అందుబాటులో ఉంటాయని, రద్దీ ఎక్కువగా ఉండేప్రాంతాలలో నిరంతరం వైద్య సిబ్బంది ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జంపన్నవాగు ప్రాంతంలో గజ ఈతగాళ్లను మోహరించాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో క్యూలైన్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, జిల్లా వైద్యాధికారి అప్పయ్యసామాజిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి జగదీశ్, ఏటూర్‌నాగారం ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి సురేష్, ఇతర వైద్య అధికారులు, సిబ్బంది ఉన్నారు.

బైక్ అంబులెన్సు సేవలు ప్రారంభం

మహాజాతరలో భక్తులకు అత్యవరస వైద్య సేవలు అందించేందుకు వీలుగా బైక్‌అంబులెన్స్‌లను మంత్రి సీతక్క, హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా చోంగ్తు, హెల్త్ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్, ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠిలతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతు. మేడారం భక్తులకు అత్యవసర వైద్యం కోసం 40బైక్ అంబులెన్సులు అందుబాటులో ఉంటాయని, ఈబైక్ అంబులెన్సుల ద్వారా 21 వైద్య సేవలను అందించే వీలుందన్నారు.

మేడారం వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని మంత్రి సీతక్క అన్నారు. మేడారంలోని హరిత హోటల్‌లో శనివారం ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే సమ్మక్క సారలమ్మల జాతర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలన్నా రు. ముఖ్యంగా తాగునీరు, మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండాలని, మరుగుదొడ్లు ఉన్నచోట అదనపు ప్లాస్టిక్ బకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. తాగునీటి కొరత లేకుండాచూడాలన్నారు. పార్కింగ్ స్థలాల్లో మరుగుదొడ్ల సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నా రు. నిరంతరం విద్యుత్ అందిచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో ములుగు కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్పీ శబరీష్ అదనపు కలెక్టర్ శ్రీజ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ అధికారులున్నారు.

మీడియాతో ఆత్మీయ సమ్మేళనం

మహాజాతర విజయవంతానికి సన్నద్ధం చేస్తున్న అధికారులు మీడియా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని మంత్రి సీతక్క అన్నారు. గిరిజన బాలికల ఆశ్రమ ఇంగ్లీష్ పాఠశాలలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనంలో ఆమె తొలుత సమాచారపౌరసంబంధాల శాఖ రూపొందించిన మేడారం పుస్తకాన్ని, మీడియా టీషర్టులను కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్పీ శబరీష్‌తో కలిసి ఆవిష్కరించారు. జాతర విజయవంతం చేయడంలో మీడియాకీలకపాత్ర పోషించాలని, సమ్మక్క సారలమ్మ మహా జాతరకీర్తి ప్రతిష్టలు ప్రపంచం నలుమూలాల తెలిసే వార్తలు ప్రసారం చేయాలని కోరారు. మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేకంగా మీడియా సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, వసతులు, భోజన సౌకర్యం ఉంటుందన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి జాతరకొచ్చే భక్తుల కోసం రూట్‌మ్యాప్ వీడియోను మంత్రి విడుదల చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజా, ఏటూరునాగారం అదనపు ఎస్పీ శిరిశెట్టి సంకీర్త్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, సమాచార శాఖ అదనపు డైరెక్టర్‌లక్ష్మణ్, జిల్లా పౌరసంబంధాల అధికారి రఫీక్, ఏపీఆర్‌వో వేణు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

6వేల ప్రత్యేక బస్సులు

అతిపెద్ద గిరిజన జాతర మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు ఆర్టీసీ ప్రత్యేకంగా 6వేల బస్సులను నడపడానికి సిద్ధంగా ఉందని మంత్రి సీతక్క అన్నారు. శనివారం మేడారంలో తాత్కలిక ఆర్టీసీ బస్టాండ్‌ను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ 55ఎకరాల విస్తీర్ణంలో బస్టాండ్‌ను ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా టికెట్ కౌంటర్‌లు, విశ్రాంతి గదులు, సిబ్బంది వసతి ఏర్పాట్లు చేశామన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా జాతరకు వచ్చే మహిళా భక్తులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. భక్తులు ఈసారి అధికంగా వచ్చే అంచనాలు ఉన్నందున గతంలో కంటే ఎక్కువగా 6వేల బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని భక్తులు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజా, అదనపు ఎస్పీ సంకీర్త్, ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం శ్రీలత, ప్రత్యేకాధికారి శ్రీధర్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ద్వారా అమ్మవార్ల ప్రసాదం

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 17: మేడారం సమ్మక్క - సారలమ్మ మహా జాతర సందర్భంగా అమ్మవార్ల జాతరకు వెళ్లలేని భక్తులు తమ కానుకలను, మొ క్కులను ఆన్‌లైన్ ద్వారా అమ్మవార్లకు చెల్లిస్తే, ఆర్టీసీ కార్గో ద్వారా భక్తుల ఇం టికే ప్రసాదం అందించే ఏర్పాట్లు అధికారులు చేశారు. ఈనెల 21 నుంచి 25 వరకు దేవాదాయ శాఖతో ఆర్టీసీ కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా ప్రతీ బస్సుస్టేషన్ ప్రాంతంలో కార్గో కొరియర్ సేవలందించే కార్యాలయం వద్ద రూ. 300 అమ్మవార్లకు చెల్లిస్తే, భక్తుల ఇంటికి ప్రసాదాలు పసుపు, కుంకుమలు అందజేస్తారు. వివరాలకు 040-69440069 / 69440000 / 23450033 లకు సంప్రదించాలని కోరారు.

మేడారంలో చోరీ - రూ.11.42 లక్షల అపహరణ

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 17 : మేడారంలో దొంగలు సంచరిస్తున్నారని, జంపన్నవాగు, తల్లుల గద్దెలు, ఆర్టీసీ బస్టాండ్, చిలకలగుట్ట మార్గంలో ఇప్పటికే 16 చోరీలు జరిగినట్టు పోలీసులు వెల్లడించారు. ఓ కొబ్బరికాయలు, బెల్లం వ్యాపారం నిర్వహించే షాపులో శుక్రవారం దొంగలు చోరీకి పాల్పడ్డారు. రాత్రి సమయంలో నిర్వాహకులు షాపు మూసి వెళ్లిన తర్వాత షాపులోకి చొరబడ్డారు. షాపులో ఉన్న రూ. 11.42 లక్షల నగదును ఎత్తుకెళ్లినట్టు నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జంపన్నవాగు ప్రాంతంలో ఒక మహిళ మెడలో నుంచి 30 గ్రాముల పుస్తెల తాడు చోరీకి గురైంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.



ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న బిర్రు మహేందర్

20న మానుకోటకు మందకృష్ణ మాదిగ రాక

- ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నేతలు తరలిరావాలి
- జిల్లా ఇన్‌చార్జ్ బిర్రు మహేందర్

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి17 : జిల్లా కేంద్రంలో ఈనెల 20న జరుపతలపెట్టిన మహబూబాబాద్ పార్లమెంటరీ స్థాయి ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ సదస్సుకు వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని జిల్లా ఇన్‌చార్జ్ బిర్రు మహేందర్ మాదిగ తెలిపారు. మానుకోట పట్టణంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ త్వరలోనే జరుగుతుందని, ఉప కులాల పోరాటాలకు ఫలితం వస్తుందని చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నేతలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో అనిల్ కుమార్, పోలెపాక ఎల్లయ్య ఇరుగు రవి, పోలెపాక శంకర్, అంజిబాబు, నవీన్, రాంబాబు, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

మహబూబాబాద్‌టౌన్, ఫిబ్రవరి 17 : జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. అన్ని మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు కేక్‌లు కట్ చేసి, పార్టీ శ్రేణులకు పంపిణీ చేశారు. మానుకోట పట్టణంలో వేడుకలో భాగంగా కేసీఆర్ జన్మదిన కేక్‌ను స్థానిక మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంగా తెలంగాణ అభివృద్ధే లక్ష్యంగా పని చేశారని, ఆయన భవిష్యత్ రాజకీయ నేతలకు ఆదర్శనీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అర్బన్ అధ్యక్షుడు గద్దె రవి, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్ధన్, కర్పూరపు గోపి, బోనగిరి గంగాధర్, చిదిరాల శరత్, ఎడ్ల శ్రీను, వీరేందర్, కృష్ణ, శ్రీకాంత్, శశికుమార్ పాల్గొన్నారు.

- మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేసీఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్‌చేసి, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ అధ్యక్షుడు గద్దె రవి, మండల అధ్యక్షుడు తేళ్ల శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ఎల్మిమల్లయ్య, లూనావత్ అశోక్‌నాయక్, ఆవుల వెంకన్న, అంగోతు కిషన్, గుగులోతు రాజు, వెంకట్‌రెడ్డి, మందుల రఘు, ప్రశాంత్‌రెడ్డి, సంతోష్, సందీప్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.
- రాష్ట్ర వన్యప్రాణి సంరక్షణ మండలి మాజీ సభ్యుడు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు బానోత్ రవికుమార్ నేతృత్వంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. మానుకోట మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ జెరిపోతుల వెంకన్న, మాజీ డైరెక్టర్ కన్న, సంతోష్, రామకృష్ణ పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..



మరిపెడ పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నవీన్‌రావు



మానుకోటలో కేసీఆర్ జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి

- మరిపెడ మునిసిపల్ కేంద్రంలో మాజీ సీఎం జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపుడి నవీన్‌రావు ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, బ్రెడ్లు, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిపాల్‌రెడ్డి, గంధసరి కృష్ణ, మక్సూద్, శ్రీను, నర్సయ్య పాల్గొన్నారు.
- తొర్రూరులో కేసీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. బీఆర్‌ఎస్ కార్యాలయంలో కేక్ కట్‌చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు సీతారాములు, జడ్పీటీసీ మంగలంపల్లి శ్రీనివాస్, దొంగరి శంకర్, కాలునాయక్, శ్రీను, ప్రదీప్‌రెడ్డి, వెంకన్న, రమేష్, బాలు పాల్గొన్నారు.
- గార్లలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను జరిపారు. మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, తాళ్లూరి శ్రీను, గాజుల గణేష్, భాస్కర్‌రావు, అనిల్ పాల్గొన్నారు.
- కురవి మండలం ఎలకచెట్టు తండాలో జీపీ పరిధిలోని మేఘ్యాతండాలో కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ యూత్ రాష్ట్ర నాయకుడు గుగులోతు రవికుమార్, మాజీ సర్పంచ్ తేజావత్ అమ్మి, లూనావత్ వీరన్న, మాలోతు రమేష్, గుగులోతు వెంకన్న, బానోత్ బాలు, గుగులోతు వీరన్న, లక్ష్మణ్, బాలు, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు. గుండ్రాతిమడుగులో ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జడ్పీటీసీ బండి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జంగిలి హరిప్రసాద్, ఆటో డ్రైవర్లు పనికర శ్రీను, బస్వ ఉపేందర్, రాజు, వెంకటాచారి, సురేష్, లక్ష్మణ్, నగేష్, సందీప్, బీఆర్‌ఎస్ నాయకులు వెంకన్న, ఉపేందర్, మల్లేష్ పాల్గొన్నారు.
- డోర్నకల్ గాంధీ సెంటర్‌లో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న, వైస్ చైర్మన్ కోటిలింగం, మానుకోట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కత్తెరశాల విద్యాసాగర్, కౌన్సిలర్లు సురేందర్‌జైన్, పోటు జనార్దన్, అశోక్, మధుసూదన్, యశోదర్, గౌస్‌పాష, కొత్త వీరన్న, అంకతి సీతారామయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.
- కొత్తగూడలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ మండలఅధికారప్రతినిధి నెహ్రూనాయక్, ఎంపీటీసీ సంతోషరాణి, వెంకటేష్, మాజీ ఎంపీపీ స్వామి, యాదగిరి, శ్రీను, రమేష్ పాల్గొన్నారు.
- గూడూరులో కేసీఆర్ జన్మదినోత్సవ వేడుకలను నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేం వెంకటకృష్ణారెడ్డి, బీరవెల్లి వేణుగోపాల్‌రెడ్డి, నూకల సురేందర్, వెంకన్న, కటాన్‌సింగ్, రహీం, నర్సింహానాయక్, రాంచందర్, ఎల్లయ్య, రామన్న, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.
- కేసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు నజీర్ అహ్మద్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎంపీపీ వోలం చంద్రమోహన్, జాటోతు హరీష్ నాయక్, గుగులోతు వీరు, మోడెం రవీందర్‌గౌడ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సట్ల వెంకన్న, రవీందర్ గౌడ్ గంధసిరి సోమయ్య, ఆగ వెంకన్న, ఈసం లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.
- బయ్యారం మండలం గంధంపల్లిలో కేసీఆన్ జన్మదిన కేక్ కట్ చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ తాతాగణేష్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ గంగుల సత్యానారాయణ, ఐలయ్య, శివ, నవీన్, సురేష్ పాల్గొన్నారు.
- పెద్దవంగర బీఆర్‌ఎస్ కార్యాలయంలో నిర్వహించిన మాజీసీఎం కేసీఆర్ జన్మదిన వేడుకల్లో మండల పార్టీ అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ రామచంద్రయ్య, కనుకుంట్ల వెంకన్న, ఎంపీటీసీ రవీందర్, శ్రీరాం సుధీర్, బోనగిరి లింగమూర్తి, వీరన్న, శ్రీను, మల్లికార్జునచారి,సమ్మయ్య, సోమన్న, భాస్కర్, రఘు, హేమని, రవి, బిక్షపతి, వేణు, శంకర్, యాకయ్య, రమేష్, కృష్ణ, స్వామి పాల్గొన్నారు.

మద్యం తాగి డబ్బుల కోసం వేధిస్తున్నాడని..

భర్తను హతమార్చిన భార్య

వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలో ఘటన



రాజు (ఫైల్)

దుగ్గొండి, ఫిబ్రవరి 17 : మద్యం తాగడంతో పాటు తనకు డబ్బులు ఇవ్వాలని తరచూ వేధిస్తున్నాడన్న కోపంతో ఆ మహిళ తన కుటుంబసభ్యులతో కలిసి భర్తను హతమార్చింది. రాళ్లతో కొట్టి ఊరితీసి మరీ చంపిన ఈ ఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని మైసంపల్లిలో శనివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. మైసంపల్లికి చెందిన జేరుపోతుల రాజు (55)కు భార్య లక్ష్మి, కుమారులు ప్రశాంత్, సూర్య, కుమార్తెలు మాధవి, చింటు ఉన్నారు. వీరిలో కుమార్తెలకు వివాహమైంది. రాజు కుటుంబం వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా.. తాగుడుకు బానిసైన ఆయన డబ్బుల కోసం భార్య వేధిస్తున్నాడు. ఈ క్రమంలో రాజు కుటుంబం శుక్రవారం సమ్మక్క దేవుడికి కొలుపు చేసుకోవడంతో ఆ కార్యక్రమానికి కుటుంబసభ్యులంతా హాజరయ్యారు. రోజు వారిగానే శుక్రవారం అర్ధరాత్రి డబ్బుల కోసం లక్ష్మితో రాజు గొడవ పడ్డాడు. దీంతో కోపోద్రిక్తులైన భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె మాధవి, అల్లుడు రాకేశ్, మరో బంధువైన తరుణ్ కలసి రాజును రాళ్లతో కొట్టి ఊరితీసి చంపారు. సీఐ శ్రీనివాస్, ఎస్ఐ పరమేశ్ శనివారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకొనివివరాలు సేకరించారు. మృతుడి పెద్ద కుమారుడు ప్రశాంత్ ఫిర్యాదుతో ఆ ఐదుగురిపై కేసు నమోదు చేశామని సీఐ వెల్లడించారు.

నీటి సంపులో పడి అన్నాచెల్లెలు మృతి

- అర్ధరాత్రి మూత్ర విసర్జనకు లేచిన క్రమంలో ఘటన
- చీకట్లో సంపు కనిపించక అందులో పడ్డ చిన్నారులు
- ఇద్దరు బిడ్డల్ని పోగొట్టుకుని తల్లిదండ్రుల కన్నీరుమున్నీరు
- బాధిత కుటుంబానిది తాండూరు
- మేడారం జాతర కోసం వరంగల్‌లోని అత్తింటికి వచ్చిన కుటుంబం

వరంగల్ టౌన్, ఫిబ్రవరి17 : మేడారం మహాజాతరకు వెళ్లి సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవాలన్న ఆనందంలో తన కుమారుడు, కూతురితో అత్తవారింటికి వచ్చిన ఆ దంపతులకు తీరని గుండెకోత మిగిలింది. రాత్రి వరకు వచ్చీరాని మాటలతో తమతో సరదాగా గడిపి.. ఆ తర్వాత అర్ధరాత్రి వరకు సెల్‌ఫోన్‌లో వీడియోలు చూస్తూ నవ్వుతూ తుళ్లుతూ ఉండి.. పెద్దవాళ్లంతా నిద్రకు ఉపక్రమించిన క్రమంలో మూత్ర విసర్జన కోసమని బయటకు వచ్చిన ఆ అన్నాచెల్లెలు చీకటిలో ఇంటి ఆవరణలో మూత లేకుండా ఉన్న సంపులో పడి ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఈ విషాద సంఘటన శుక్రవారం అర్ధరాత్రి వరంగల్‌లోని ఏనుమాముల బాలాజీనగర్‌లో జరిగింది. బంధువులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.



తేజస్వినీ (ఫైల్)



శౌర్యతేజ (ఫైల్)

వరంగల్‌లోని ఏనుమాముల బాలాజీనగర్‌కు చెందిన శ్రీనివాస్, రమ దంపతులు 30 ఏళ్లుగా మార్కెట్ సమీపంలో టీషాపు నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు కాగా పెద్దకూతురు బాలేశ్వరీని ఆరేళ్ల క్రితం వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన కరణం రవితేజకు ఇచ్చి వివాహం చేశారు. వారికి శౌర్య తేజ (3), తేజస్విని (ఏడాదిన్నర) వయసున్న సంతానం ఉన్నారు. రవితేజ పౌరహిత్యం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో సమ్మక్క సారలమ్మలను దర్శించుకోవాలన్న యోచనలో శుక్రవారం సాయంత్రం రవితేజ తన కుటుంబంతో కలిసి వరగంల్ బాలాజీనగర్‌లోనిని అత్తవారింటికి వచ్చాడు. రాత్రి భోజనాలయ్యాక అందరూ నిద్రపోయారు. శౌర్యతేజ, తేజస్విని సెల్‌ఫోన్ చూసుకుంటూ ఉన్నారు. ఈక్రమంలో రాత్రి 11గంటల తర్వాత వారిద్దరూ మూత్ర విసర్జన కోసం ఇంటిబయట ఉన్న స్నానాలగదికి వెళ్లేందుకు బయటకు వచ్చారు. కానీ చీకటిగా ఉండటంతో ఇంటి ఆవరణలో మూతతీసి ఉన్న సంపులో పడిపోయారు. కొద్దిసేపటి తర్వాత చిన్నారుల అలికిడి లేకపోవడం, వారు మంచంపై కనిపించకపోయేసరికి ఆందోళన చెందిన తల్లిదండ్రులు రవితేజ, బాలేశ్వరి, తాత శ్రీనివాస్, అమ్మమ్మ రమ బయటికి వచ్చి చుట్టుపక్కల వెతికారు. కానీ, వారు కనిపించకపోవడంతో అనుమానం వచ్చి సంపులో చూడగా శౌర్యతేజ, తేజస్విని నీటిలో కనిపించారు. వెంటనే వారిని బయటకు తీసి ఎంజీఎంకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై ఏనుమాముల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇక ఒకేరోజు ఇద్దరు బిడ్డలను పోగొట్టుకున్న రవితేజ, బాలేశ్వరి దంపతులు కన్నీరుమున్నీరవుతున్నారు.

సెల్‌ఫోన్ ఇవ్వడమే కొంపముంచింది..

రాత్రి భోజనం తర్వాత తమ చిన్నారులకు సెల్‌ఫోన్ ఇవ్వడమే తమకు శాపమైందని తండ్రి రవితేజ గుండెలవిసేలా రోదిస్తున్నారు. 'మేం ప్రయాణం చేసి అలసిపోయి నిద్రపోయాం. పిల్లలిద్దరూ సెల్ ఫోన్ చూసి పడుకుంటారని అనుకున్నాం. కానీ, అంతలోనే ఇంత దారుణం జరుగుతుందని ఊహించలేకపోయాం. అందరి తల్లిదండ్రులకు చేతులెత్తి మొక్కుతున్నాం. పిల్లలకు సెల్‌ఫోన్ చూడటం అలవాటు చేయవద్దు.. ప్లీజ్' అంటూ విలపించడం అక్కడి వారిని కంటతడిపెట్టించింది.

మానుకోటలో సీఎం ఫ్లెక్సీకి జలాభిషేకం

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 17 : రాష్ట్రంలో బీసీ కులగణన చేయాలని అసెంబ్లీలో తీర్మాణం చేయడాన్ని హర్షిస్తూ మనుకోట పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి పవిత్ర గంగానది జలంలో జలాభిషేకం చేశారు. అనంతరం టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రకార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు శంతన్ రామారాజు మాట్లాడారు. అనంతరం ఇల్లందు బైపాస్‌లోని జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బండోజు ఉపేంద్రాచారి, పిండ్రాల రాందాసు, వెంకటాచారి, నారాయణసింగ్, ఆసిఫ్, ఉపేందర్, జహీరుద్దీన్, సిరిపురం వీరన్న, గుంజె హన్మంతు, తోట సురేష్, లాలయ్య, నవీన్ పాల్గొన్నారు.

కొమురంభీం స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలి

టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు డోలి సత్యనారాయణ



కొమురం భీం విగ్రహానికి పూలమాల వేస్తున్న నేతలు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 17 : ఆదివాసీ పోరాట యోధుడు కొమురంభీం స్ఫూర్తిని మరింత ముందుకు తీసుకువెళ్లాలని తెలంగాణ జనసమితి (టీజేఎస్) జిల్లా అధ్యక్షుడు డోలి సత్యనారాయణ అన్నారు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జోడేఘాట్‌లో శనివారం కొమురంభీంస్మారక కేంద్రాన్ని శనివారం సందర్శించారు. కొమురంభీం జల్,జంగిల్,జమీన్ పోరాటాలను జోడే ఘాట్ కేంద్రంగా చేసిన పోరాట స్మృతులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ మాలమహానాడు (టీఎంఎం) రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, తెలంగాణ ఉద్యమకారులు నాగరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

జీఎంపీఎస్ డైరీ ఆవిష్కరణ

కేసముద్రం, ఫిబ్రవరి 17 : గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం నూతన సంవత్సర డైరీని కేసముద్రంలో శనివారం ఎస్ఐ వంశీధర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కన్నెబోయిన రామకృష్ణ, తరాల వీరేష్, కొల్లూరి మధుకర్, ఏసల్ల సత్యనారాయణ, ఏర్పుల కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

'మార్కెట్‌కు మేడారం జాతర సెలవులివ్వాలి'

కేసముద్రం, ఫిబ్రవరి 17 : మేడారం జాతర సందర్భంగా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 21 నుంచి 23 వరకు సెలవులు ఇవ్వాలని కోరుతూ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కంచ వెంకన్న ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రాన్ని మార్కెట్ ప్రత్యేకహోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావుకు అందజేశారు. కార్యక్రమంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు జాటోత్ బిచ్చానాయక్, దుగ్గిరాల వెంకన్న, బానోత్ శ్రీను, పంతులు, భాస్కర్ పాల్గొన్నారు.

విజ్ఞాన యాత్రకు బయలు దేరిన రైతులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఫిబ్రవరి 17 : అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (ఆత్మ) సౌజన్యంతో హైదరాబాద్‌లో జరుగుతున్న అగ్రిటెక్ సౌత్-2024 ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రి యూనివర్సిటీ భారత పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో అగ్రి యూనివర్సిటీలో జరిగే సౌత్ సమ్మిట్, ఎక్స్‌పో యొక్క నాలుగో ఎడిషన్‌లో జరిగే విజ్ఞాన యాత్రకు మహబూబాబాద్ జిల్లా నుంచి శనివారం తరలివెళ్లారు. ఉదయం రైతులు వెళ్లే బస్సును జిల్లా వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణభారతదేశంలో వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్ దాని అనుబంధ రంగాలను ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. మండల వ్యసాయాధికారి ఎస్.తిరుపతిరెడ్డి, ఆత్మ సిబ్బంది బాలాజీ, మనోహర్ పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళి

కేసముద్రం, ఫిబ్రవరి 17 : బీసీ కులగణన చేయడాన్ని స్వాగతిస్తూ కేసముద్రంలో శనివారం జ్యోతిరావు పూలే విగ్రహానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి, క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో బీసీలను చిన్నచూపు చూసిందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు బండారు దయాకర్, మాజీ జడ్పీటీసీ కదిరె సురేందర్, పట్టణ అధ్యక్షుడు రావుల మురళి, వోలం రమేష్, పోలెపల్లి వెంకట్‌రెడ్డి, చిలువేరు సమ్మయ్యగౌడ్, దామరకొండ ప్రవీణ్‌కుమార్, వసంతరావు, మాసాడి శ్రీనివాస్, తరాల సుధాకర్ పాల్గొన్నారు.

మునిసిపల్ కమిషనర్‌ను కలిసిన యూనియన్ నాయకులు

తొర్రూరు, ఫిబ్రవరి 17 : తొర్రూరు మునిసిపల్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన శాంతికునార్‌ను వివిధ ప్రజాసంఘాల నాయకులు కలిశారు. శనివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని మునిసిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ శాంతికునార్‌ను కలిసి బొకేఅందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు కొత్తపల్లి రవి మాట్లాడారు. యూనియన్ నాయకులు ప్రసాద్, వెంకన్న, శేఖర్, భిక్షపతి, రామస్వామి, సాయిలు, నవీన్, సురేష్ ఉన్నారు.

మోదీని గద్దె దించాలి : సీపీఎం

మరిపెడ, ఫిబ్రవరి 17 : కార్మిక సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ సంస్థల పెత్తందారులకు వేల కోట్ల రూపాయాలు దోచిపెడుతున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీని పేదలంతా ఏకమై రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గద్దె దించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం మరిపెడ మునిసిపల్ కేంద్రంలో ఆ పార్టీ కార్యకర్తల సమావేశం నందిపాటి వెంకన్న అధ్యక్షతన జరుగగా ఆయన హాజరై మాట్లాడారు. నాయకులు మండల కార్యదర్శి దుండి వీరన్న, బాణాల రాజన్న, కందాల రమేశ్, అల్లి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

తొర్రూరు రూరల్, ఫిబ్రవరి 17 : చెర్లపాలెం ఉన్నత పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా డి.హర్షిత, ఎంఈవోగా డి.రాకేష్, డీఈవో ఎండీ సమీర్‌తో పాటు మరికొంత మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రతిభకనబర్చిన విద్యార్థులకుమండల స్పెషల్ ఆఫీసర్ శోభన్‌బాబు, హెచ్ఎం బుచ్చయ్య బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులు యాకూబ్‌అలీ, సబియాబాను, తనుజ, నర్మద, జయపాల్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లేశం, రవీందర్, ప్రభావతి పాల్గొన్నారు.

బాలవికాస సేవలు అభినందనీయం

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి



కేక్ కట్ చేస్తున్న ఝాన్సీరెడ్డి

తొర్రూరు, ఫిబ్రవరి 17 : బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు సేవా కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని, వారి సేవలను ఎంత పొగిడినా తక్కువేనని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. శనివారం తొర్రూరులోని లయన్స్‌క్లబ్ ఆవరణలో బాలవికాస తొర్రూరుశాఖ 17వ సానుభూతి సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. అనంతరం అనాథ పిల్లల జన్మదిన సందర్భంగా పిల్లలచే కేక్ కట్ చేయించి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాలవికాస ప్రోగ్రామ్ మేనేజర్ లత, తొర్రూరు కోఆర్డినేటర్ వై.రమ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, జగదీష్, సంతోష్, అచ్చిరెడ్డి, జ్యోతి, సరళ, రమ, శైలజ, శోభ, సరిత పాల్గొన్నారు.

'మొక్కల పెంపకంపై శ్రద్ధ వహించాలి'

పెద్దవంగర, ఫిబ్రవరి 17 : నర్సరీల్లో పెంచే మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ వహిచాలని ఎంపీడీవో బి.వేణుమాధవ్ అన్నారు. శనివారం బావోజీతండా, చిన్నవంగర గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'ఇంటింటికి ఏనుగు గుర్తును తీసుకెళ్లండి'

మరిపెడ, ఫిబ్రవరి 17 : ఇంటింటికి ఏనుగు గుర్తును పరిచయం చేసి పల్లెపల్లెలకు బీఎస్పీ పార్టీని విస్తరించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం మరిపెడ మునిసిపల్‌లోని కనుకదుర్గ మినీ ఫంక్షన్ హాల్‌లో ఆ పార్టీ డోర్నకల్ నియోజకవర్గ ముఖ్యనేతల సమావేశం నియోజకవర్గ అధ్యక్షుడు భాషింపంగు మహేందర్ అధ్యక్షతన జరుగగా, ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సమావేశంలో బానోత్ రవీందర్, విజయ్‌కాంత్, ప్రసాదరావు, అభినాయక్, ఉపేందర్, ఎడ్ల శ్రీను, ఐతెం ఉపేందర్, పరుశరాములు పాల్గొన్నారు.

విద్యార్థులు పరీక్షలపై భయం వీడాలి : ఎస్ఐ

చిన్నగూడూరు, ఫిబ్రవరి17 : పరీక్షలంటే విద్యార్థులు భయంవీడి ప్రణాళికతో చదువుతే విజయం సులభమవుతుందని ఎస్సై ఝాన్సీ అన్నారు. ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించగా, ఎస్సై హాజరై ప్రశ్నపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోటీ పరీక్షలను ప్రతీ విద్యార్థిని వినియోగించుకొని, తమ ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం టాలెంట్ టెస్ట్ నిర్వహించిన ఎస్ఎఫ్ఐ మండల కమిటీకి అభినందనలు తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పట్ల మధు, ఎస్ఓ లలిత, గునిగంటి మోహన్, సోని, మహేష్, వినయ్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలస్యంగా నడుస్తున్న పలు రైళ్లు

డోర్నకల్, ఫిబ్రవరి 17 : చింతకాని- బోనకల్ స్టేషన్ల మధ్య దిగువ లైన్ కిలోమీటర్ 505, వద్ద శనివారం ఉదయం గూడ్సురైలు పట్టాలు తప్పింది. దీంతో విజయవాడ వైపువెళ్లే పలుగూడ్సు, ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. డోర్నకల్‌లో ఆగే కృష్ణ, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు మూడు గంటల పాటు ఆలస్యంగా నడిచాయి. కాజీపేట, డోర్నకల్-విజయవాడ ప్యాసింజర్‌ను అధికారులు రద్దు చేశారు. ఖమ్మం వరకు వెళ్లిన ప్యాసింజర్‌ను తిరిగి డోర్నకల్‌రైల్వే స్టేషన్‌కు రప్పించారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

అటవీ ఉద్యోగులకు పీఆర్సీలో న్యాయం చేయాలి

మహబూబాబాద్‌టౌన్, ఫిబ్రవరి 17 : అటవీ పరిరక్షణకు అహర్నిశలు పని చేస్తున్న అటవీశాక ఉద్యోగుల శ్రమను గుర్తించి, వచ్చే పీఆర్సీలో సముచిత స్థానం కల్పిస్తూ ఇతర యూనిఫాం శాఖలతో సమాన వేతనం అందించాలని అటవీశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాంబు కోరారు. మహబూబాబాద్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ గత పీఆర్సీలో అటవీశాఖ ఉద్యోగులకు సరైన వేతనం లేని కారణంగా ఆవేదన గురవుతున్నారని చెప్పారు. అడవుల పరిరక్షణలో తమ ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్న అటవీశాఖ ఉద్యోగులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సంవత్సరానికి రెండుసార్లు యూనిఫామ్‌లు ఇవ్వాలని కోరారు. వచ్చే పీఆర్సీలో అటవీశాఖ ఉద్యోగుల సేవలను గుర్తించి, సమూలమార్పులు తీసుకురావాలని కోరారు. విష్ణు, విక్రమ్‌కుమార్, రమేష్, కవిత సత్యం పాల్గొన్నారు.

మున్నేరు లిఫ్ట్.. మూలన పడింది..

(5వ పేజీ తరువాయి)

నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో రూ.80 లక్షలతో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లిఫ్టుకు రూపకల్పన చేశారు. దానికి నిధులు మంజూరు చేసిన తర్వాత పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు పనులు పూర్తి చేయడానికి సంవత్సరంపైగా పట్టింది. ఆ తర్వాత రెండేళ్ల పాటు లిఫ్ట్ ద్వారా బతుకమ్మ చెరువు నీళ్లందించారు. దీంతో ఆయకట్టుకు డోకాలేదని రైతులు భావించారు. అనంతరం సమృద్ధిగా వర్షాలు పడడంతో లిఫ్ట్‌ద్వారా వచ్చే నీటిమీద రైతులు ఆధారపడలేదు. దీంతో పుష్కరకాలంగా లిఫ్ట్ మూలకు పడింది. ఇది వినియోగంలో లేకపోవడంతో రైతులతో పాటు, అధికారులు దానిని పట్టించుకున్న పాపానపోలేదు.

నిర్వహణ లోపంతోనే..

లిఫ్ట్ నిర్మాణంలో భాగంగా మున్నేరు అనకట్ట సమీపంలో పంప్‌హౌస్ నిర్మించారు. ఇందుకుగాను 20 హెచ్‌పీ సామర్థ్యం గల రెండు మోటార్లను అమర్చారు. మోటార్లకు సరిపడ నీటిని అందించడానికి ఇంటెక్ వెల్ తవ్వారు. దానిలోనికి వచ్చిచేరే మున్నేరు నీటిని పంపుల ద్వారా తోడి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న బతుకమ్మ చెరువును నింపేందుకు 200 ఎంఎం డయామీటర్ సామర్థ్యం కలిగిన పైపులతో పైపులైన్ నిర్మించారు. లిఫ్ట్ నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత రెండేళ్లపాటు లిఫ్ట్ ద్వారా చెరువులోకి నీటిని మళ్లించారు. ఆ తర్వాత లిఫ్ట్ నిర్వహణ కొరకు రైతులు స్వచ్ఛందంగా ఎకరాకు రూ. 500 చొప్పున వసూలు చేసి వచ్చిన డబ్బులతో రెండేళ్ల పాటు నిర్వహణ చేపట్టారు.



మున్నేరు వద్ద ఏర్పాటు చేసిన లిఫ్టు పంప్ హౌజ్ ముందు ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

ఇందు కొరకు నెలకు రూ.4 వేల చొప్పున ఇచ్చి ఓ వర్కర్ లిఫ్ట్, మోటార్ల నిర్వహణ కొరకు ఏర్పాటు చేసుకున్నారు. ఆ తర్వాత రైతులు డబ్బులు ఇవ్వడానికి ముందుకు రాకపోవడంతో లిఫ్ట్ నిర్వహణను అధికారులతో పాటురైతులూ పట్టించుకోలేదు. దానికి తోడు సుమారు మూడేళ్లపాటు సమృద్ధిగా వర్షాలు కురియడంతో లిఫ్ట్ వైపు ఎవరూ కన్నెత్తి చూడలేదు. ఆ తర్వాత సుమారు రూ.2లక్షలకు పైగా కరెంట్ బిల్లులు పెండింగ్‌లో పడడంతో అధికారులు, రైతులకు లిఫ్ట్ నిర్వహణ భారంగా మారింది.

చోరీకి గురైన సామగ్రి..

పైపులైను కిలోమీటర్‌కు ఒకదాని చొప్పున రెండు ఎయిర్ వాల్వ్‌లను ఏర్పాటు చేశారు. లిఫ్ట్ మూలన పడడం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పైపులైన్ల మధ్యలో ఏర్పాటు చేసిన ఎయిర్ వాల్వ్‌లను దొంగలు ఎత్తుకువెళ్లారు. పంప్‌హౌస్‌లోని రెండు చిన్నమోటార్లు చోరీకి గురయ్యాయి. పైపులైన్లు ఉన్న చోట కొందరు తవ్వకాలు చేపట్టడంతో పైపులైన్లు దెబ్బతిన్నాయి. అప్పటి వరకు ఎవరు పట్టించుకోకపోవడంతో మూలనపడ్డ లిఫ్ట్ గురించి ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో బతుకమ్మ చెరువు ఆయకట్టు రైతుల దృష్టి ఒక్కసారిగా లిఫ్ట్ వైపు మళ్లింది. లిఫ్ట్ ద్వారా చెరువును నింపాలనే డిమాండ్ వెలుగులోకి వచ్చింది. అంతేకాకుండా మత్స్యకారులు కూడా వర్షాభావ పరిస్థితుల వల్ల ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉండడంతో వారు సైతం లిఫ్ట్‌కు మరమ్మతులు చేసి, వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యేనే తప్పుతోవ పట్టించిన అధికారులు..?

ఈ ఏడాది వర్షాలు సరిగా పడకపోవడంతో బతుకమ్మ చెరువు రైతులు నీరందక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గత జనవరిలో డోర్నకల్ మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ డాక్టర్ రాంచంద్రునాయక్ దృష్టికి కొందరు రైతులు తీసుకువచ్చారు. సమావేశంలో మున్నేరుపై ఏమైనా లిఫ్టులు ఉన్నాయా అని ఎమ్మెల్యే ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించడంతో వారు ఏమి లేవని వారు ఎమ్మెల్యేకు బదులిచ్చారు. దీనికి కారణం లేకపోలేదు! లిఫ్ట్ ఏర్పాటు చేసినప్పుడు ఉన్న ఇరిగేషన్ అధికారులు బదిలీ కావడం, కొందరు పదవీవిరమణ పొందడం, అలాగే కొందరు పదోన్నతులపై వేరే జిల్లాలకు బదిలీ కావడంతో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఇరిగేషన్ ఇంజనీర్లకు ఆ లిఫ్ట్ గురించి తెలియదనే విషయం ఉత్పన్నమవుతుంది. ఇప్పటికైనా అధికారులు మున్నేరుపై ఏర్పాటు చేసిన లిఫ్ట్ మోటార్లు, పైపులైన్ వాల్వులకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యేను, ఇరిగేషన్ అధికారులను రైతులు, మత్స్యకారులు, ప్రజలు కోరుతున్నారు.

31 మంది జేపీఎస్‌లు రెగ్యూలర్

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 17 : జిల్లాలో 31 మంది జూనియరల్ పంచాయతీ కార్యదర్శులు (జేపీఎస్)ను రెగ్యూలర్ శనివారం రాత్రి కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఉత్తర్వులను జారీ చేశారు. జిల్లాలోని 18 మండలాల పరిధిలో 461 గ్రామపంచాయతీలు ఉండగా, అందులో మూడు సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసిన 31 మందిని క్రమబద్ధీకరించారు. గంగారంలో 4, కొత్తగూడెం 2, నెల్లికుదురు 1, మహబూబాబాద్ 1, గూడూరు 1,డోర్నకల్ 1, గార్ల 11, బయ్యారం10 మందిని రెగ్యూలర్ చేసినట్లు తెలిపారు.

టెన్త్‌లో నూరుశాతం ఫలితాలు సాధించాలి

- జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్

గార్ల, ఫిబ్రవరి 17 : రాబోయే పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు నూరుశాతం ఫలితాలను సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్ అన్నారు. శనివారం గార్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు వందశాతం ఫలితాలు సాధించే విధంగా విద్యాబోధన గావించాలన్నారు. విద్యార్థులలో పరీక్షల భయాలను పోగొట్టడానికి తగిన తర్ఫీదు ఇవ్వాలన్నారు. అనంతరం విద్యార్థుల అందుతున్న విద్యను స్వయంగా అడిగి తెలుసుకొని ఉపాధ్యాయులు పనితీరు, రికార్డులను పరిశీలించారు ఈ కార్యక్రమంలో ఎంపీవో రజిని, హెచ్ఎం శీలంశెట్టి వెంకటేశ్వర్లు, చింతనిప్పు రమేష్ పాల్గొన్నారు.

పార్లమెంట్ సీటు నాకే ఇప్పించండి

- అసోసియేట్ ప్రొఫెసర్ ఈసం సారయ్య దొర

గంగారం, ఫ్రిబ్రవరి 17 : కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానంతో మాట్లాడి మహబూబాబాద్ ఎంపీ సీటు తనకు ఇప్పించాలని బావురుగొండ గ్రామానికి చెందిన ప్రొఫెసర్ ఈసం సారయ్య దొర శనివారం హైదారాబాదులోని ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి అభ్యర్ధన పత్రాన్ని ఇచ్చారు. తన బయోడేటాలో ఎంపీ స్థానానికి తనకున్న అర్హతలను గిరిజనులలో తనకున్న పలుకుబడితో పాటు తాను చేసిన పలు సేవా కార్యక్రమాలను వివరించి, తనకు ఎంపీగా పోటీచేసే అవకాశం కల్పించాలని ఆయన కోరారు.

వీరభద్రస్వామి ఆలయంలో.. షెడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

కురవి, ఫిబ్రవరి 17 : శ్రీవీరభద్రస్వామి దేవాలయానికి వచ్చే భక్తులకు ఎండ నంచి, వర్షం నుంచి రక్షణ కల్పించేందుకు ఆలయంలో గాల్వాన్యం (పర్మినెంట్ రేకులషెడ్డు)ను నిర్మిస్తున్నారు. భద్రాచలం, బాసర, వరంగల్ భద్రకాళి ఆలయాల్లో ఉన్నతరహాల్లోనే కురవి ఆలయంలోనూ ఈ గాల్వాన్యం నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన వీరభద్ర ట్రావెల్స్ అధినేత పి.మల్లయ్య కుమారులు శ్రీనివాస్, వెంకటేష్, నవీన్ రూ.45లక్షలు వెచ్చించి, ఈ నిర్మాణాన్ని చేపట్టారు. మహాశివరాత్రి కురవి జాతరలోగా ఈ నిర్మాణాన్ని పూర్తిచేసి, భక్తులకు అందుబాటులోకి తెస్తామని ఆలయ ఈవో సత్యనారాయణ తెలిపారు. ప్రాకార మండపానికి, ఆలయానికి మధ్యలో ఈ గాల్వాన్యం నిర్మాణం జరుగుతోందన్నారు.